క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : నల్లగొండలోని డాన్‌బాస్కో పాఠశాలలో కొనసాగుతున్న చండూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం, ఎంపీహెచ్ అర్హత గల వారు అర్హులని, వేతనం రూ.14 వేలు చెల్లిస్తారని తెలిపారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తులు అందజేయాలని, 20వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని విమర్శించే స్థాయి లేదు

కేతేపల్లి: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని విమర్శించే స్థాయి, నైతికత మాజీ మంత్రి హరీశ్‌రావుకు లేదని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. బుధవారం కేతేపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి వెంకట్‌రెడ్డిపై హరీశ్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే కమలమ్మకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్ : నకిరేకల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మూసపాటి కమలమ్మ పదో వర్ధంతిని బుధవారం నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జరుపుకున్నారు. కమలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లం సత్తయ్య, ఏర్పుల రేణుక, ఏశబోయిన పాండు, ఏశబోయిన వెంకటేషం, కదిరె రమేష్, కొండ అంజమ్మ, ఆరాల వెంకన్న, పిండి సాయి, ఏశబోయిన వెంకన్న పాల్గొన్నారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పెండెం రాములు


రాములును సత్కరిస్తున్న నాయకులు

నకిరేకల్ : పట్టణానికి చెందిన పెండెం రాములు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్‌లోని హరిహర భవనంలో మంగళవారం జరిగిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో రాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాములును పద్మశాలి సంఘం నాయకులు పెండెం గణేశ్, పున్న శంభయ్య, ఏలే గణేశ్, మూడుదుద్ల శ్రీను, నర్సయ్య, చిట్టిప్రోలు యాదగిరి, నరేందర్‌లు అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన


అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మర్రిగూడ : మండలంలోని యరగండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలలు నిండిన చిన్నారులకు అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు రజిత, మమత, ఆశా వర్కర్, తల్లులు పాల్గొన్నారు.

ఓక్ ట్రీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఓక్ ట్రీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల చైర్మన్ గింజల నరేందర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు సెకండ్ లెవల్‌కు అర్హత సాధించారన్నారు. డి.అన్విత, మరియ ఖదీజ, ఎమ్.శ్రీనిధి, సీహెచ్.హిమాన్షులు 100 లోపు ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ గడ్డం మంగారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

అధిక చలికి జాగ్రత్తలు ఇవీ..

పొగమంచులో లైట్లతో ప్రయాణించాలి

మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లావణ్య సూచన



నల్లగొండ : జిల్లాను చలి వణికిస్తోంది. రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతుండడంతో జనాలు చలికి అల్లాడిపోతున్నారు. రాత్రిపూట చల్లటి గాలులు వీస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే రోడ్లపై జనాలు తగ్గిపోతున్నారు. స్వెటర్లు వేసుకోకుండా బయటకు రాని పరిస్థితి నెలకొంది. చలి తీవ్రత మరింత పెరుగుతున్నందున వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

- అత్యవసర సందర్భాల్లో ప్రయాణం తప్పనిసరి అయినట్లయితే జాగ్రత్తలు పాటించాలి.
- చలితోపాటు మంచు ప్రభావం ఈ సీజన్‌లో ఎక్కువగా ఉంటుంది.
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఉంటుంది. కాబట్టి ఫాగింగ్ లైట్లు వేసుకోవాలి.
- ఇండికేటర్లను కూడా ఉపయోగించాలి.
- పొగ మంచులో కారులో ప్రయాణించేవారు ప్రధానంగా లైట్లను ఆన్ చేయాలి.
- ద్విచక్ర వాహనదారులు ఇండికేటర్ లైట్లు, లైట్లను ఆన్‌లో ఉంచుకుని ప్రయాణం చేయాలి.
- వాహనదారులు స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించి వెళ్లాలి.
- చలికి వణుకుతూ వాహనం నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.



- లావణ్య, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, నల్లగొండ

సేఫ్టీ ఎలక్ట్రానిక్ వస్తువులు వాడాలి

ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయదారుడు గాలి శివకుమార్ సలహా



రామగిరి(నల్లగొండ): జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. చలికి వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లే వారు చల్లటి నీటితో స్నానం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. వేడి నీళ్లతో స్నానాలు చేస్తున్నారు. చలికాలంలో వాటర్ హీటర్లు, గీజర్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. వీటి వినియోగంపై నిపుణుల సూచనలు..

- సేఫ్టీగా ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- షాక్ ప్రూఫ్ బాడీ హీటర్ వాడితే 50 శాతం విద్యుత్ షాక్ నుంచి కాపాడుకోవచ్చు.
- పాడైపోయిన హీటర్లను వాడకూడదు.
- చిన్న పిల్లలు ఉన్నవారు జాగ్రత్త వహించాలి.
- ఇంటికి తప్పనిసరిగా ఎర్త్ ఉండేలా చూసుకోవాలి.
- మెటల్ బాడీ గీజర్లు వాడొద్దు.
- పాలి కార్బోనేట్(పీసీ)తో తయారైన గీజర్ వాడాలి.
- గీజర్‌కు ఆటోమెటిక్ ఆఫ్ లేకపోతే వైరింగ్ కాలిపోయే అవకాశం ఉంది.
- కొన్నిసార్లు ఫిలమెంట్ పేలిపోయి ప్రమాదాలు సంభవిస్తాయి.


గాలి శివకుమార్, ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయదారుడు

వెలవెలబోతున్న కొంపల్లి చెరువు


చుక్కనీరు లేక వెలవెలబోతున్న కొంపల్లి పెద్ద చెరువు


ఆనవాళ్లు కనబడకుండా పూడిపోయిన కొంపల్లి ఫీడర్ చానల్

- నీరు లేక ఎండిపోయిన చెరువు
- తగ్గిన భూగర్భ జలాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, మత్స్యకార్మికులు

మునుగోడు: రైతుల పంట పొలాలకు సాగు నీరు అందించడంతోపాటు భూగర్భ జలాల పెరిగేందుకు 80 ఏళ్ల క్రితం కొంపల్లి గ్రామంలో పెద్ద చెరువును నిర్మించారు. ఆ చెరువులోకి వరద నీరు వచ్చి చేరేందుకు నారాయణపురం మండలం పుట్టపాక గ్రామ శివారులోని ఓ చిన్నవాగు నుంచి ఫీడర్ చానల్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి 20 ఏళ్ల క్రితం వరకు ఆ ఫీడర్ చానల్ ద్వారా చెరువులోకి వరద నీరు వచ్చి చేరేది. అయితే రెండేళ్లుగా ఆ ఫీడర్ చానల్ నుంచి వరద నీరు రావడం పూర్తిగా నిలిచిపోవడంతో ఆ చెరువులోకి నీరు వచ్చి చేరడం లేదు. దీంతో కొంపల్లి పెద్ద చెరువు నీరులేక వెలవెలబోతోంది.

మరమ్మతులకు నోచుకోని ఫీడర్ చానల్..

80 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఫీడర్ చానల్‌కు అధికారులు ఇప్పటివరకు ఒక్కమారు కూడా మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఆ ఫీడర్ చానల్‌లో పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగిపోయాయి. అంతేకాకుండా ఆ కాల్వకు ఇరువైపులా ఉన్న రైతులు కాల్వను కబ్జా చేయడంతోపాటు తమ వ్యవసాయ భూమిలోని రాళ్లు, నరికివేసిన తాటి చెట్లను అందులో పడేశారు. దీంతో ఆ ఫీడర్ చానల్ పూర్తిగా పూడిపోయి కనీసం ఆనవాళ్లు లేకుండా పోయింది. కనీసం పదేళ్లకు ఒకమారు మరమ్మతులు చేసినా వర్షాలు కురిసిన సమయంలో ఆ కాల్వ ద్వారా వరద నీరు వచ్చి చెరువు నిండేది. కానీ ఆ ఫీడర్ చానల్‌కు మరమ్మతులు చేసేవారే కరువయ్యారు. వర్షాలు కురిసిన సమయంలో ఆ చెరువు చుట్టూ ఉన్న భూముల నుంచి వచ్చే నీరు తప్ప ఇతర నీటి వసతి లేకుండా పోయింది.

132 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం...

కొంపల్లి గ్రామానికి పైభాగంలో నిర్మించిన చెరువు దాదాపు 132 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉంటుంది. ఆ చెరువు నిండితే భూగర్భ జలాలు పెరగడంతోపాటు చెరువు కింది భాగంలో దాదాపు 120 ఎకరాల వరకు పంట సాగుకు నీరు సరఫరా అయ్యేది. చెరువులో చేపలు పెంచుకుని ఆ గ్రామంలోని దాదాపు 100 మంది మత్స్యకార్మికులు ఉపాధి పొందేవారు. చెరువులోకి నీరు రాకపోవడంతో ఇటూ రైతులకు, అటు మత్స్యకార్మికులకు ఉపాధి కరువైంది. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కొంపల్లి గ్రామ పెద్ద చెరువులోకి వరద నీరు వచ్చే ఫీడర్ చానల్‌కు మరమ్మతులు చేయించి చెరువు నిండేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ రైతులు, మత్స్యకార్మికులు వేడుకుంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కొంపల్లి గ్రామ పెద్ద చెరువులోకి నీరు వచ్చే ఫీడర్ చానల్ పూడిపోయిందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఫీడర్ చానల్ పూడిక తీతకు ఎంత ఖర్చు వస్తుందో అంచనా వేసి ప్రతిపాదనలు తయారు చేశాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు ప్రారంభించి ఫీడర్ చానల్ మరమ్మతులు చేయిస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

–ప్రేమ్‌కుమార్, ఐబీ డీఈ, మునుగోడు

పత్తి పంట సాగు చేస్తున్నా



మా గ్రామ పెద్ద చెరువు కింద నాకు భూమి ఉంది. ఆ చెరువు నిండితే పొలం పారేది. 20 ఏళ్లుగా చెరువు పూర్తిగా నిండకపోవడంతో వ్యవసాయ మోటార్లు అంతంత మాత్రంగానే నీళ్లు పోస్తున్నాయి. దీంతో నేను వరి పంటకు బదులు పత్తి పంట సాగుచేస్తున్నా. కాల్వకు మరమ్మతులు చేయించి చెరువులోకి నీరు వచ్చేలా చేస్తే బాగుండు.

–దాం నర్సింహ, రైతు కొంపల్లి

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి


కేతేపల్లి: నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

కేతేపల్లి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకుల, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి కోరారు. కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన వారికి బుధవారం ఆయన నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు బీజేపీ గెలుచుకునేలా బూత్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. 273, 274, 275 బూత్ కమిటీల అధ్యక్షులుగా చెవుగోని రాజు, రాచకొండ శ్రవణ్, పాడిశెట్టి రవి ఎన్నికయ్యారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మొగిలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, చినేని జానయ్య, ఎ.అనిత, సాయన్న, కొరివి శంకర్, మధుకర్‌రెడ్డి, రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీలగిరిలో బీజేపీ జెండా ఎగురవేయాలి

నల్లగొండ టూటౌన్ : రానున్న ఎన్నికల్లో నీలగిరి మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని 8వ వార్డు అక్కలాయిగూడెంలో బూత్ కమిటీ ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర సహ సభ్యత్వ ప్రముఖ్ గోలి మధుసూదన్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, మిర్యాల వెంకటేశం, ఎల్.వెంకన్న, ముంత సైదులు, రేఖ నాగబాబు, చిన్నాల ఆంజనేయులు, మేకల రవి, నాగరాజు గౌడ్, పిల్లి కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు


సర్వేలో పాల్గొన్న కమిషనర్ బాలయ్య

నకిరేకల్ : అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం దశలవారీగా మంజూరు చేస్తుందని నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ బాలయ్య తెలిపారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని ఒకటో వార్డు సుందరయ్యనగర్, వైఎస్సార్ కాలనీ, రంగారెడ్డి నగర్‌లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. నకిరేకల్ మున్సిపాలిటీలో 6048 ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. వీటిలో ఇప్పటివరకు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో 1150 ఇళ్ల కోసం ఆయా వార్డు ఆఫీసర్లు సర్వే పూర్తి చేశారని వివరించారు. త్వరలో మిగతా సర్వే పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ కందాల భిక్షంరెడ్డి, వార్డు ఆఫీసర్ జ్యోతి, అశోక్‌రెడ్డి, హరీష్, మంజుల, రాచకొండ లక్ష్మీ, గున్నాల అర్చన , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్ష


దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

మర్రిగూడ : పేదల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి మహారాజ్ రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు వంటి వాటిని ప్రభుత్వం అందించాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ వర్గాల ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వినోద్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజు, జగన్, గిరి, యాదయ్య, రవి, సుదర్శన్, నవీన్, రాంబాబు, పగిళ్ల రాములు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ


పూజలో పాల్గొన్న నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు


నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ..

నల్లగొండ: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో బుధవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప గురుస్వాములు అభిషేకాలు, మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి–చైతన్య దంపతులు, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, శ్యామ్ గురుస్వామి, రవికుమార్, అశోక్, విశ్వప్రసాద్, రాంపాటి శ్రీను, కోమటిరెడ్డి పృథ్వీధర్‌రెడ్డి, వంగాల అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో..

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి మారోజు కాశిదాసు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో మోత్కూరు బ్రహ్మచారి, చొల్లేటి నరసింహాచారి, వనమా శ్రవణ్, చొక్కారపు వెంకన్న, అమరావతి రేణుక, పద్మ, అంజలి, నాగరాణి, రమ, ఇందిరా, మౌనిక, చొక్కారపు మాధవి, శ్రావణి పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు

నల్లగొండ: ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో జరుగుతున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్ సీజన్ 5 క్వార్టర్ ఫైనల్ క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి. బుధవారం క్వార్టర్ ఫైనల్స్ పోటీలు జరిగాయి. పోటీలను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యలు తిలకించారు. ఈ నెల 19న సెమీఫైనల్, 20వ తేదీన ఫైనల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, భువనగిరి ప్రభాకర్, ముత్తినేని నాగేశ్వరరావు, జూలకంటి శ్రీనివాస్, జేరిపోతుల భాస్కర్ గౌడ్, ఆలకుంట్ల మోహన్ బాబు, కత్తుల కోటి, గాలి నాగరాజు, మామిడి కార్తీక్, పాదం అనిల్, కంచర్ల ఆనంద్ రెడ్డి, పాలకూరి శ్రీధర్, వెంకట్‌రెడ్డి, ఏర్పుల శ్రవణ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని కనకదుర్గ కాలనీలో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం 11 హోమ కుండీలతో చండీహవనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు, హోమాలు, మహాబలి, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వర్కాల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కున్‌రెడ్డి రాంరెడ్డి, కోశాధికారి మారం జగదీశ్వర్‌రెడ్డి, వైదిక నిర్వాహకుడు తోటపల్లి ఆనందశర్మ, కాలనీవాసులు మారెడ్డి వెంకట్‌రెడ్డి, కజ్జం జ్యోతి విమల, లక్ష్మి, కమలాకర్‌రావు, హరిప్రసాద్, అంజయ్య, రామలింగయ్య, లింగయ్య, సంజీవరెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలి

నకిరేకల్ : విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకుని బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశం సూచించారు. నకిరేకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన తల్లిదండ్రుల, అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవి రాబోయే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వార్డెన్ యాదగిరి, అధ్యాపకులు మద్దెల శ్రీనివాస్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఆర్‌పీలకు గత పీఆర్సీ జీఓ 60 ప్రకారం రూ.19 వేల వేతనం అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేకరకాల సర్వేలు, సంక్షేమ పథకాల్లో పాల్గొంటున్న మెప్మా ఆర్‌పీలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. 8 నెలల మెప్మా ఆర్‌పీల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో అద్దంకి నరసింహ, అవుట రవీందర్, జ్యోతి, కె సుజాత, ఎ స్వరూప, ఎం.సరిత, ఎండీ.పర్వీన్, ఆర్.పాపయ్య, జె.సైదులు, జి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.


రైతులను వేధిస్తున్న కూలీల కొరత !


చొల్లేడు గ్రామంలో కూలీలు దొరకకపోవడంతో పత్తిని చేనుపైనే వదిలేసిన రైతు

మునుగోడు: మండలంలో రోజురోజుకూ వ్యవసాయ కూలీల కొరత పెరుగుతోంది. దీంతో రైతులు సాగు చేసిన పంట దిగుబడి చేతికి అందడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ప్రధానంగా పత్తి ఏరేందుకు కూలీల కొరత తీవ్రమైంది. కొంత మంది రైతులు ఆంధ్రా, ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చి స్థానికంగా ఆవాసం కల్పించి పత్తిని ఏరిస్తున్నారు. మరి కొంతమంది రైతులు స్థానిక కూలీలతో పత్తిని ఏరిస్తున్నారు. ఇంకొందరు రైతులకు స్థానికంగ కూలీలు, ఇతర ప్రాంతాల కూలీలు దొరకపోవడంతో తమ పంటను చేనుపైనే వదిలేస్తున్నారు.

మ్యాథ్స్ పోటీల్లో ద్వితీయ బహుమతి

చిట్యాల: మండలంలోని వనిపాకల జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి బక్కతట్ల మల్లేష్ ఇటీవల జిల్లా మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ద్వితీయ బహుమతి పొందాడు. మల్లేష్‌తోపాటు మండల స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన మేడి హరిణి, బర్రె ధనలక్ష్మీలను ఆ పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనయ్యాచారి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దంతూరి సైదులుగౌడ్, గంపల రవీందర్‌రెడ్డి, కవిత, జ్యోతి, నర్సింహాచారి, నజీర్ ఉస్సేసా, విజయ, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల నిరసన

నకిరేకల్ (శాలిగౌరారం): అపరిష్కృతంగా ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(పీఎంటీఏ) రాష్ట్ర కన్వీనర్ కుక్కడపు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని శాలిగౌరారం మండలంలోని వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఎంఈఓ సైదులు, ఎంపీడీఓ పద్మ, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు అందించాలని కోరారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ, కృష్ణయ్య, శ్రీను, సంధ్యారాణి, శ్రీరాములు, శ్వేత, సంగీత, సృజన, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె


సమ్మెకు మద్దతు తెలుపుతున్న శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదవ రోజుకు చేరింది. వీరి సమ్మెకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్షా అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తానని వాగ్దానం చేసి.. ఇప్పుడు మాట మారుస్తోందని ఆరోపించారు. 20 సంవత్సరాలుగా విద్యాశాఖ అభివృద్ధికి కృషి చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే వీరికి న్యాయం చేయాలని, లేకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించేంత వరకూ దీక్షను కొనసాగిస్తామని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నెలపాట్ల సత్యనారాయణ, కేశ బోయిన శంకర్, నల్ల మధుయాదవ్, కందుల వెంకటేష్ గౌడ్, గుమ్మల మంజులారెడ్డి, నీలాంబరి, వసంత, రాజేశ్వరి, కొండ చంద్రశేఖర్, కొండయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

మర్రిగూడ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న చలో హైదరాబాద్‌కు వెళ్తున్న గ్రామపంచాయతీ కార్మికులను ముందస్తు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఊరిపక్క లింగయ్య, యాదయ్య, రాములు, నరసింహ, మంజుల, రమణ, అంజయ్య, ముత్తయ్య, మహేష్, వెంకటయ్య, పద్మ పాల్గొన్నారు.